# ఆడ ఆఫీసరంటే అలుసా?

జనం గుంపులుగా నిలబడి ఉన్నారు. శ్వేతగారి గదికి దగ్గరగా! "ఏమైందబ్బా? ఎందుకిలా ఉన్నారు జనం?" అనుకుంటూ భయంభయంగా అడుగులేసింది ఝాన్సీ!

శ్వేత ఆ సంస్థలో ఒక ఆఫీసరు. అందంగా, నాజూగ్గా, ఆకర్షణీయంగా ఉంటుంది. దానికి తగ్గట్టు ఆమెలో వున్న చలాకీతనం, చురుకుగా మాట్లాడే నైజం, చమత్కారంగా ఎవరినీ నొప్పించకుండా తాను నొవ్వకుండా మాట్లాడే సరళి, కొట్టొచ్చినట్టు కనబడే ఆమె తెలివితేటలూ, అందరినీ ఆకట్టుకుంటాయి.

ఆమె చక్కగా అలంకరించుకుంటుంది. అంటే వెర్రిగా నగలూ, నాణ్యాలూ, పట్టుచీరలూ, పూలూ కాదు. ఆఫీసుకి ఎలా రావాలో ఆమెకి తెలుసు.

అటువంటి శ్వేతగారి గది బయట అంతమంది నించుని గుసగుసలుగా ఏం మాట్లాడుకుంటున్నారో అర్థం కాక చూసింది ఝాన్సీ!

రామారావు చిదానందంతో అంటున్నాడు. "ఆయనెవడో సూటూబూటూ వేసుకుని, చిన్నమీసాలూ, క్రాపూ ఎర్రగాబుర్రగా అందంగా ఉన్నాడు. దాదాపు రెండు గంటలనుంచీ అక్కడే కూర్చునున్నాడు. ఉండుండి నవ్వులూ మాటలూ వినపడుతున్నాయ్! అర్థంకాక చూస్తున్నాం" అన్నాడు.

చిదానందం వెకిలిగా నవ్వుతూ "బాయ్‌ఫ్రెండేమో!" అన్నాడు.

"ఈవిడకి పెళ్ళయి మొగుడున్నాడు కదా! బాయ్ ఫ్రెండ్ ఎలా వుంటాడు ఇంకా?"

"ఏం పెళ్ళయితే బాయ్ ఫ్రెండ్స్ ఉండకూడదా? ఇంకా ఎక్కువే వుండొచ్చు" పళ్ళన్నీ బయటపడేలా నవ్వుతూ అన్నాడు రామారావు.

ఇంటిదగ్గర కొస్తే మొగుడికి తెలుస్తుందనేమో ఆఫీసుకొచ్చాడు".

"హి...హి...హి..." ఇద్దరూ నవ్వుకున్నారు.

ఝాన్సీకి ఒంటిమీద తేళ్ళూ, జెర్రులూ పాకినట్టయింది. "ఒక ఆడ ఆఫీసరు గురించి అంత అసభ్యంగా, అసహ్యంగా మాట్లాడతారా వీళ్ళు.

ఝాన్సీ శ్వేత దగ్గర పి.ఎ. శ్వేత ఝాన్సీతో చనువుగా మాట్లాడుతుందని తెలుసు అందుకే ఝాన్సీని చూడగానే తల వంచుకుని, వాళ్ళ వాళ్ళ సీట్లలో కూర్చున్నారు.

కాస్సేపటికి బెల్ కొట్టింది శ్వేత. అటెండర్ సోమయ్యొచ్చి "అమ్మగారు పిలుస్తున్నారు" అన్నాడు ఝాన్సీని. ఝాన్సీ ఒక్కసారి రామారావు వంకా, ఒకసారి చిదానందం వంక చూసి, లోపలికెళ్ళింది. ఆమె అలా చూస్తూ వుంటే లోపలికెళ్ళి ఆమెతో ఏం చెబుతోందోనని భయపడి చచ్చారు రామారావూ, చిదానందమూ!

మరో రెండు నిమిషాల్లో సోమయ్యొచ్చి "మిమ్మల్ని రమ్మంటున్నారు" అన్నాడు రామారావుకేసి చూసి. రామారావు నీరుగారి పోయాడు.

"రండి రామారావుగారూ! ఒకసారి మొన్న మనం కట్టిన టాక్స్ ఫైలొకసారి పట్టుకురండి" అంది.

"ఓకే! మేడమ్!" అంటూనే నవ్వుతూ మాట్లాడుతున్న అతనికేసి ఒకసారి ఓరగా చూశాడు రామారావు. వెంటనే వెళ్ళిపోతున్న రామారావుని వెనక్కి పిలిచి "రామారావుగారూ! బై..ది..బై.. మీట్ మై హస్బెండ్ మిస్టర్ సురేష్‌చంద్ర... మై అసిస్టెంట్ రామారావ్" అంటూ పరస్పరం పరిచయం చేసింది శ్వేత! అతను నవ్వుతూ రామారావుకి కరచాలనం చేశాడు. రామారావు వెర్రివాడిలా గుడ్లప్పగించి చూస్తూ ఆగిపోతుందేమోనన్నట్టు గుండెని ఎడంచేత్తో పట్టుకున్నాడు రామారావు.

ఝాన్సీ అతనికేసి చూసింది. రామారావు సిగ్గుతో తలవంచుకున్నాడు. మతిపోయిన వాడిలా మెల్లగా అడుగులు వేసుకుంటూ గది బయటికి వచ్చాడు.

ఝాన్సీ అతని వెనకాలే వచ్చింది.

"ఏయ్ రామారావు! నువ్వు గదిలోకి వెళ్ళేసరికి వాళ్ళేం చేస్తున్నారు? సీటులోంచి లేచొచ్చి అడిగాడు చిదానందం.

"నోరుమూసుకో" అన్నాడు రామారావు.

"ఏమీ? ఎందుకని?" సొంజ్ఞ చేసి అడిగాడు చిదానందం.

ఝాన్సీ రామారావుకేసి కొరకొరా చూసింది. "సమాధానం చెప్పరేం?" అంది కోపంగా.

"చూడకూడనిదేమైనా చూశారా? నోటితో చెప్పలేక పోతున్నారా? అన్నాడు ఇకిలిస్తూ చిదానందం.

"మాట్లాడకోయ్! అతను ఆవిడగారి భర్తగారు" అన్నాడు ముక్తసరిగా రామారావు.

"ఆ...!" నోరు తెరిచాడు చిదానందం!

ఝాన్సీ "ఛీ! మీరు మనుష్యులేనా? మీకూ భార్యబిడ్డలూ, అక్కచెల్లెళ్ళూ లేరూ! సాటి ఆడవాళ్ళు ఉద్యోగాలకొస్తే, వాళ్ళ గురించి మీరు ఇలాగనేనా మాట్లాడేది?" అంటూ అక్కడినుంచి విసురుగా వెళ్ళిపోయింది ఝాన్సీ!

వారి ప్రవర్తనకు సిగ్గుపడుతూ, నెత్తిమీద చేతులు పెట్టుకుని కూర్చున్నారు రామారావూ, చిదంబరం! *